జాతీయ దిన పత్రిక

# తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 41 19-2-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

జాతీయ దిన పత్రిక తొలివెలుగు

మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com

Contacts

తెలంగాణ


94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.


## 27 ప్రాజెక్టులు, రూ.29,021 కోట్ల

# పెట్టుబడులకు సీఎం ఆమోదం



- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 22,407 ఉద్యోగాల కల్పన
- 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ప్రాతిపదిక కావాలన్న సీఎం
- ప్రాజెక్టుల పురోగతిపై ఇకపై ప్రతినెలా సమీక్షించనున్న ముఖ్యమంత్రి
- విశాఖలో దేశంలోనే అత్యుత్తమంగా 'భారత్ మండపం' నిర్మాణం

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' విధానమే ప్రభుత్వ ప్రాధాన్యత అని, ఆమోదం పొందిన ప్రతీ ప్రాజెక్టు వేగంగా కార్యరూపం దాల్చాలని ఆయన అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన 15వ రాష్ట్ర స్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) సమావేశంలో రూ.29,021 కోట్ల విలువైన 27 ప్రాజెక్టులకు ఆమోదముద్ర వేశారు. ఈ భారీ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,407 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

# అదే మా ప్రభుత్వ లక్ష్యం

## తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం




- 8 ఏళ్లలో హైదరాబాద్ నెట్ జీరో సిటీ
- రాష్ట్రాన్ని 'క్యూర్, ప్యూర్, రేర్' జోన్లుగా విభజించాం
- ముంబై 'క్లైమేట్ వీక్' సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి
- ఢిల్లీలో ప్రధాని విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి
- రేవంత్‌ను ఆప్యాయంగా పలకరించిన మోదీ
- రేపు ఏఐ సమ్మిట్‌లో ప్రసంగించనున్న రేవంత్
- నేడు తెలంగాణ కాంగ్రెస్ నేతలతో అధిష్ఠానం భేటీ

హైదరాబాద్ తెలంగాణను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణలో హరిత ఇంధనమే కీలకమని తెలిపారు. రాష్ట్రంలో హరిత ఇంధనానికి ప్రాధాన్యమిస్తున్నామన్నారు. ముంబైలో మహారాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న 'క్లైమేట్ వీక్' సదస్సులో బుధవారం సీఎం రేవంత్ పాల్గొని మాట్లాడారు. దేశంలోని పట్టణాలు, నగరాల అభివృద్ధి, వాతావరణ మార్పులకు అనుగుణంగా చేపట్టాల్సిన చర్యల విషయంలో తెలంగాణ దృక్కోణాన్ని వివరించారు. బొగ్గు, సంప్రదాయ ఇంధన వనరుల వినియోగాన్ని..

- మిగతా 2వ పేజీలో

## మదనపల్లె బాలిక హత్యపై సీఎం తీవ్ర విచారం



- నిందితుడిని వదిలిపెట్టేది లేదని కుటుంబానికి భరోసా
- బాలికపై అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానం
- నిందితుడిని కఠినంగా శిక్షిస్తామన్న హోం మంత్రి అనిత



## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

- యుద్ధ ప్రాతిపదికన హాస్టల్ భవనాల మరమ్మతులు చేపట్టండి
- ప్రీ బడ్జెట్ సమావేశాల్లో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క

2లో



## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

- 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించిన మంచిర్యాల కోర్టు
- సుమన్‌తో పాటు మరో ముగ్గురిని కూడా జైలుకు తరలింపు
- క్యాతనపల్లి మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సందర్భంగా జరిగిన ఘటన

2లో



## ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య చేసిన సైకోని ఈ ప్రభుత్వం పట్టుకోలేదు..

- మదనపల్లెలో చిన్నారిపై అత్యాచారం చేసి హత్య చేసిన సైకో..
- రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై దారుణమైన ఘటనలు జరుగుతున్నాయి..
- చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత బాలికలు, మహిళలపై అనేక దాడులు: వైఎస్ జగన్

2లో

# నేడు ఏఐ కీలక సదస్సు

- దేశాధినేతల నుంచి ఏఐ సీఈఓల దాకా పాల్గొననున్న
- అతిరథ మహారథులు సదస్సును ప్రారంభించి ప్రసంగించనున్న మోదీ
- తర్వాత మాక్రాన్, గుటెరస్ తదితరుల ప్రసంగాలు
- దేశాధినేతలు, సీఈఓలతో ప్రధాని వరుస భేటీలు



న్యూఢిల్లీ: ఇండియా ఏఐ ఇంపాక్ట్ కీలక సదస్సు గురువారం ఢిల్లీలో జరగనుంది. రంగాలవారీగా ఏఐ ప్రభావం, దాని సమర్థ వినియోగం, ప్రతికూల ప్రభావాల కట్టడి తదితరాలపై పలువురు దేశాధినేతలు, దిగ్గజ ఏఐ కంపెనీల సారథులు, విద్యావేత్తలు, పరిశోధకులు సదస్సు వేదికగా లోతుగా మేధోమథనం జరపనున్నారు. ఈ ప్రతిష్టాత్మక సదస్సు గ్లోబల్ సౌత్‌లో జరగనుండటం ఇదే తొలిసారి. గురువారం ఉదయం ఢిల్లీలోని భారత్ మండపంలో సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభిస్తారు. అనంతరం అందులో పాల్గొంటున్న పలువురు దేశాధినేతలు, ప్రముఖులతో విడిగా సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారు. తర్వాత సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించనున్నారు. మోదీతో పాటు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్ కూడా సదస్సులో మాట్లాడతారు. పలు ఏఐ దిగ్గజ సంస్థల సీఈఓలు, పారిశ్రామిక ప్రముఖులు తదితరులు తమ అభిప్రాయాలను పంచుకుంటారు.

- మిగతా 2వ పేజీలో



## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది:

- మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్టుపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని కైవసం చేసుకునే కుట్రలో భాగమే ఈ అరెస్ట్ అని ఆరోపణ
- అధికార పార్టీకి కొందరు పోలీసులు తొత్తులుగా మారారని విమర్శ
- సుమన్‌ను బేషరతుగా విడుదల చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

2లో



## మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవం

- వైద్యులకు దిశానిర్దేశం చేసిన మంత్రి లోకేశ్
- వైద్య విద్య పూర్తికావడం నిరంతర అభ్యాసానికి లైసెన్స్ లాంటిదని వ్యాఖ్య
- సాంకేతికత సాయం చేసినా, వైద్యుడి స్పర్శలోని స్వస్థత శక్తికి సాటిలేదన్న మంత్రి

2లో

## జైలు జీవితం బాగా ఎంజాయ్ చేశాను

- బెయిల్ పై జైలు నుంచి విడుదలైన అంబటి రాంబాబు
- జైలులో బాత్రూంలో జారిపడటం మినహా తనకు ఎలాంటి ఇబ్బంది కలగలేదని వ్యాఖ్య
- తనను చంద్రబాబు, లోకేశ్ టార్గెట్ చేశారని తీవ్ర ఆరోపణలు
- కూటమి ప్రభుత్వంపై పోరాటం ఆగదని స్పష్టీకరణ

## మేం మళ్లీ అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి ఉంటుంది:

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పోలీసులు అరెస్ట్ చేయడంపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న అధికార దుర్వినియోగానికి పరాకాష్ఠ అని ఆయన మండిపడ్డారు. మంచిర్యాల జిల్లాలోని క్యాతన్‌పల్లి మున్సిపాలిటీని అడ్డదారుల్లో కైవసం చేసుకోవాలన్న దుర్మార్గపు ఆలోచనతోనే కాంగ్రెస్ ఈ కుట్రకు తెరలేపిందని కేటీఆర్ తీవ్రంగా ఆరోపించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం ఇంతటి దిగజారుడు రాజకీయాలకు పాల్పడటం సిగ్గుచేటని విమర్శించారు. ప్రజల ఆశీర్వాదంతో బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు కాంగ్రెస్ పార్టీ నేతలు చేస్తున్న ఈ దుర్మార్గాలన్నింటికీ వడ్డీతో సహా చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ తీవ్ర స్వరంతో హెచ్చరించారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ నేతలు గుర్తుంచుకుంటే మంచిదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ స్పందిస్తూ... "క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్‌కు స్పష్టమైన మెజారిటీ ఉంది. అయినా సరే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి దౌర్జన్యంగా దాన్ని చేజిక్కించుకోవాలని చూస్తున్నారు. ఈ కుట్రలో భాగంగానే సుమన్‌పై అక్రమ కేసులు బనాయించి, ఇవాళ దుర్మార్గంగా అరెస్ట్ చేయించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలకు వ్యతిరేకంగా క్యాతన్‌పల్లి ప్రజలు సంపూర్ణ బంద్ పాటించి నిరసన తెలిపినా ఈ ప్రభుత్వానికి బుద్ధి రాలేదు" అని విమర్శించారు. కొందరు పోలీసు అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. వారు తమ వైఖరి మార్చుకోకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. అక్రమ కేసులో అరెస్ట్ చేసిన బాల్క సుమన్‌ను ప్రభుత్వం తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేశారు.

## విద్య, ఆరోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం

హైదరాబాద్: ప్రభుత్వం విద్య, ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ఈ రంగాల వృద్ధికి ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం సచివాలయంలో సంక్షేమ శాఖలు, రోడ్డు రవాణా, నీటిపారుదల శాఖ, సివిల్ సప్లయీస్, రోడ్లుభవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల ప్రీ బడ్జెట్ సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్, అజహరుద్దీన్ శాఖల వారీ సమీక్షల్లో పాల్గొన్నారు. నిబద్ధతతో ప్రాధాన్యతను గుర్తించి, ఆదాయం ఖర్చుపై దృష్టి సారించి బడ్జెట్ ప్రతిపాదనలు సిద్ధం చేయాలని భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సంక్షేమ శాఖలకు సంబంధించి వసతి గృహాలు, గురుకులాల బిల్లులు వేగవంతంగా క్లియర్ చేస్తామని, వసతి గృహాల భవనాల మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

## బాల్క సుమన్‌కు 14 రోజుల రిమాండ్

మంచిర్యాల జిల్లాలో తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన ఘటనలకు సంబంధించి బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌కు మంచిర్యాల మేజిస్ట్రేట్ కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. ఆయనతో పాటు మరో ముగ్గురికి కూడా కోర్టు రిమాండ్ ఆదేశాలు జారీ చేసింది. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌పై దాడి, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారన్న ఆరోపణలతో మంగళవారం రాత్రి ఆయనపై కేసు నమోదైంది. దాంతో పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపర్చారు. వివరాల్లోకి వెళితే, మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా మంగళవారం ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఎక్స్ అఫీషియో సభ్యునిగా ఓటు హక్కు వినియోగించుకోవడానికి వచ్చిన రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ కాన్వాయ్‌ను బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకున్నాయి. ఈ క్రమంలో జరిగిన తోపులాటలో మంత్రి కాన్వాయ్‌పై రాళ్లదాడి జరిగింది. ఈ ఘటనలో మంత్రి ప్రయాణిస్తున్న కారు అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ దాడికి బాల్క సుమన్ నాయకత్వం వహించారని, పోలీసుల బారికేడ్లను స్వయంగా ఆయనే మంత్రి కాన్వాయ్‌పైకి విసిరారని ఆరోపణలు వచ్చాయి.

## ఏడేళ్ల బాలికపై అత్యాచారం, హత్య చేసిన సైకోని ఈ ప్రభుత్వం పట్టుకోలేదు..

మదనపల్లి జిల్లా నీరుగట్టువారి పల్లిలో ఏడేళ్ల బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్యచేసి, డ్రమ్ములో కుక్కిన దారుణమైన ఘటనపై మాజీ సీఎం వైఎస్ జగన్ ఎక్స్ వేదికగా స్పందించారు. బాలిక హత్య మీకు, మీ ప్రభుత్వానికి సిగ్గు చేటు కాదా.. బాలిక కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసినా, ఎందుకు ఆ చిన్నారిని కాపాడలేకపోయారు? అని ప్రశ్నించారు. నంద్యాల జిల్లా పగిడ్యాల మండలం కొత్త ముచ్చుమర్రి గ్రామంలో తొమ్మిదేళ్ల గిరిజన బాలికపై అత్యాచారం, ఆపై హత్య వైఎస్ఆర్ కడప జిల్లా మైలవరం మండలంలోని ఏ.కంబాల దిన్నెలో మూడేళ్ల బాలికపై యువకుడి అత్యాచారం, ఆపై హత్య.. తిరుపతి జిల్లా వడమాలపేటలో మూడున్నరేళ్ల చిన్నారిపై యువకుడు అత్యాచారం, ఆపై హత్య.. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత బాలికలు, మహిళలపై ఇలాంటి ఎన్నో దారుణమైన ఘటనలు జరిగినా, వాటిని మీరు తేలిగ్గా తీసుకుంటున్నారన్నది నిజం.. ఎల్లో మీడియాను వాడుకుని హడావిడి ప్రకటనలు చేయడం ఆ తర్వాత ఆ విషయాన్ని వదిలేయడం.. మీకు రొటీన్ అయిపోయిందని జగన్ మోహన్ రెడ్డి మండిపడ్డారు. అయితే, మిమ్మల్ని ఎవరైనా ప్రశ్నిస్తే వారు మాజీ మంత్రులు అయినా సరే వారి ఇళ్ల మీదకి పోలీసులను పంపి ఒక వ్యూహంతో దాడులు చేయించడం, వారి ఆస్తులను ధ్వంసం చేయడం, వారిపై హత్యాయత్నాలు చేయించడంపై మీకు ఉన్న శ్రద్ధ రాష్ట్రంలో బాలికలు, మహిళలకు రక్షణ కల్పించడంపై లేదని వైసీపీ అధినేత జగన్ పేర్కొన్నారు. మీ ప్రభుత్వంలో హోంమంత్రి లా అండ్ ఆర్డర్‌కు బాధ్యత వహించరు, మీ కుమారుడు ఆయన శాఖలను నీరుగారుస్తూ, అందరి శాఖల్లో వేలుపెడతారు. ఏ మంత్రి దేనికీ బాధ్యత వహించరు.. ముఖ్యమంత్రిగా మీకు ప్రచారం తప్ప మరేమీ పట్టదు.. ప్రభుత్వంలో ఉన్నవారికి ఇప్పుడు ఒకటే పని.. సొంత జేబులు నింపుకోవడం, పబ్లిసిటీ చేసుకోవడమే.. మరి ఇలాంటి దారుణాలపై ఎవరు దృష్టిపెడతారు? అని జగన్ క్వశ్చన్ చేశారు. ఇక, మీరు సృష్టించిన పొలిటికల్ గవర్నెన్స్‌తో, రెడ్‌బుక్ రాజ్యాంగంతో పోలీసు సహా వ్యవస్థలను కలుషితం చేస్తే ఇక లా అండ్ ఆర్డర్ ఎలా ఉంటుంది? ఎలా బతుకుతుంది? అని మాజీ సీఎం జగన్ ప్రశ్రించారు. చిన్నారులకు, మహిళలకు రక్షణ ఎక్కడ నుంచి లభిస్తుంది.

# నేడు ఏఐ కీలక సదస్సు

'సర్వజన హితాయ, సర్వజన సుఖాయ'నినాదంతో సదస్సు జరగనుంది. ప్రధానంగా ఏడు వర్కింగ్ గ్రూప్‌లు ఏర్పాటు చేసి వాటిపై కూలంకషంగా చర్చించనున్నారు. అవి ఆర్థిక ప్రగతి, సామాజిక హితానికి ఏఐ; ఏఐ వనరుల ప్రజాస్వామ్యీకరణ; సామాజిక సాధికారతకు చోటు; సురక్షిత, విశ్వసనీయ ఏఐ; మానవ వనరుల పెట్టుబడి; సైన్స్; పుంజుకునే సత్తా, ఇన్నోవేషన్, సామర్థ్యం. ఈ చర్చలన్నీ 'ప్రజలు, భూమి, ప్రగతి'ప్ర్యదానాంశాలుగా సాగుతాయి. పలువురు దేశాధినేతలతో పాటు 500 మందికి పైగా అంతర్జాతీయ స్థాయి ఏఐ సారథులు, 100 మందికి పైగా సీఈఓలు, 150 మంది విద్యావేత్తలు, పరిశోధకులు, 400 మంది సీటీఓలు, ఉపాధ్యక్షులు, దాతలు సదస్సులో భాగస్వాములు కానున్నారు. ఏఐ రంగంలో భారత్‌ను సారథ్య స్థానంలో నిలిపే లక్ష్యసాధనలో భాగంగా ఈ సదస్సును కేంద్రం నిర్వహిస్తోంది. సదస్సును ప్రారంభించి అనంతరం పలువురు దేశాధినేతలు, సీఈఓలు, ప్రముఖులతో కలిసి ఏఐ ఇండియా ఇంపాక్ట్ ఎక్స్‌పో2026ను మోదీ సందర్శిస్తారు. సోమవారం భారత్ మండపంలో ప్రారంభమైన ఎక్స్‌పోకు విశేష ఆదరణ లభిస్తుండటం తెలిసిందే. మధ్యాహ్నం నుంచి అదే వేదిక వద్ద లీడర్ల సదస్సులో ప్రధాని పాల్గొంటారు. దేశాధినేతలు, పలు దేశాల మంత్రులు, ఉన్నతాధికారులు తదితరులు ఇందులో భాగస్వాములు కానున్నారు. పాలన, మౌలిక సదుపాయాలు, సహకారంతో పాటు పలు అంశాలకు సంబంధించి ఏఐలో జాతీయ, అంతర్జాతీయ ప్రాథమ్యాలపై వారంతా మేధోమథనం జరుపుతారు. సాయంత్రం 5:30 నుంచి జాతీయ, అంతర్జాతీయ ఏఐ దిగ్గజ కంపెనీల సారథులు, సీఈఓలతో రౌండ్‌టేబుల్ సమావేశంలో మోదీ పాల్గొంటారు. ఏఐ, సంబంధిత వ్యవస్థల్లో పెట్టుబడులు, పరిశోధనలు, కొలాబరేషన్, సరఫరా వ్యవస్థలు తదితరాలపై వారితో చర్చిస్తారు. ఏఐ సదస్సుకు దేశాధినేతలు, సీఈఓలు, వీఐపీల రాక నేపథ్యంలో ఏఐ ఇండియా ఎక్స్‌పోను గురువారం మూసేయనున్నారు. అయితే ఎక్స్ పోకు లభిస్తు న్న విశేష ఆదరణ నేపథ్యంలో దాన్ని శనివారం దాకా పొడిగించాలని కేంద్రం నిర్ణయించింది. షెడ్యూల్ ప్రకారం ఎక్స్‌పో శుక్రవారం ముగియాల్సి ఉంది.

న్యూఢిల్లీ: ఏఐ ఇండియా ఇంపాక్ట్ సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన పలువురు దేశాధినేతలు, ప్రముఖులకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఢిల్లీలోని భారత్ మండపం వద్ద స్వయంగా స్వాగతం పలికారు. శ్రీలంక అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకె, గ్రీస్ ప్రధాని కైరియాకోస్ మిత్సోతకిస్, ఫిన్లండ్ ప్రధాని పెటెరీ ఓర్పో, భూటాన్ ప్రధాని షెరింగ్ గోబ్గే, మారిషస్ ప్రధాని నవీన్‌చంద్ర రామ్ గులాం, క్రొయేషియా ప్రధాని ఆంద్రెజ్ ప్లెంకోవిక్, సెర్బియా అధ్యక్షుడు అలెక్సాండర్ వుకిక్, సీషెల్స్ ఉపాధ్యక్షుడు సెబాస్టియన్ పిళ్లై, ఎస్టోనియా అధ్యక్షుడు అలర్ కరిస్, గయానా ఉపాధ్యక్షుడు భారత్ జగ్‌దేవ్ తదితరులు వీరిలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెరస్, ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టాలినా జార్జియెవా తదితరులను కూడా ప్రధాని ఆప్యాయంగా స్వాగతించారు. ఆహూతులందరికీ ఈ సందర్భంగా మేళతాళాలు, పూలు, అక్షింతలతో సంప్రదాయబద్ధంగా ఘనస్వాగతం లభించింది.

## మదనపల్లె బాలిక హత్యపై సీఎంతీవ్ర విచారం

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఏడేళ్ల బాలిక దారుణ హత్యకు గురైన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. ఆయన బాలిక తల్లిదండ్రులకు ఫోన్ చేసి పరామర్శించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టేది లేదని, నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని వారికి హామీ ఇచ్చారు. ఈ దారుణ ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. మదనపల్లెలో మూడు రోజుల క్రితం అదృశ్యమైన ఏడేళ్ల బాలిక, చివరకు శవమై తేలింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, బాలిక మృతదేహాన్ని ఎదురింట్లో గుర్తించారు. ఆ ఇంట్లో నివసించే కులవర్ధన్ అనే వ్యక్తిపై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకున్నారు. బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటన తెలియగానే స్థానికంగా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. నిందితుడిని తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ బాలిక కుటుంబ సభ్యులు, స్థానికులు మదనపల్లె-కదిరి బైపాస్ రోడ్డుపై ఆందోళనకు దిగారు. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా ఎస్పీ, సబ్ కలెక్టర్ ఘటనా స్థలానికి చేరుకుని, ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. హోం మంత్రి వంగలపూడి అనిత కూడా బాలిక కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ధైర్యం చెప్పారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, బెయిల్ రాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ పెద్దల భరోసాతో కుటుంబ సభ్యులు ఆందోళన విరమించి, బాలిక మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించేందుకు అంగీకరించారు.

## 27 ప్రాజెక్టులు, రూ.29,021 కోట్ల పెట్టుబడులకు సీఎం ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ కీలక సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, పి.నారాయణ, కె.అచ్చెన్నాయుడు, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, కందుల దుర్గేశ్, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సహా పలువురు ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఐటీ, విద్యుత్, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, మౌలిక వసతులు, పరిశ్రమల రంగాల్లో ఈ కొత్త ప్రాజెక్టులు కొలువుదీరనున్నాయి. ప్రభుత్వం ఆమోదం తెలిపిన తర్వాత కూడా ప్రాజెక్టులు క్షేత్రస్థాయిలో ముందుకు సాగకపోవడంపై సీఎం అసహనం వ్యక్తం చేశారు. ఇకపై ప్రతీ నెలా ప్రాజెక్టుల పురోగతిపై తాను స్వయంగా సమీక్ష నిర్వహిస్తానని చంద్రబాబు స్పష్టం చేశారు. ఒప్పందాలు కుదుర్చుకున్న సంస్థల యాజమాన్యాలతో అధికారులు నిరంతరం టచ్‌లో ఉంటూ, వారికి కావాల్సిన సహకారం అందించి పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్, బీపీసీఎల్ వంటి మెగా ప్రాజెక్టుల ఏర్పాటుకు ఎలాంటి ఆటంకాలు ఉండకూడదని తేల్చిచెప్పారు. భూ కేటాయింపులు పొంది కూడా నిర్ణీత సమయంలో పనులు ప్రారంభించని సంస్థలతో చర్చలు జరపాలని, వారు ముందుకు రాకపోతే భూములను వెనక్కి తీసుకోవడానికి కూడా వెనుకాడవద్దని ముఖ్యమంత్రి గట్టిగా హెచ్చరించారు. దీనిపై మంత్రుల కమిటీ దృష్టి సారించి అవసరమైతే అనుమతులు రద్దు చేయాలని సూచించారు. రాష్ట్రంలో మరిన్ని సెమీ కండక్టర్ ప్రాజెక్టులను ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అలాగే సొంత భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి అదనపు ప్రయోజనాలు అందించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

## జైలు జీవితం బాగా ఎంజాయ్ చేశాను

రాజమండ్రి సెంట్రల్ జైలు నుంచి 18 రోజుల తర్వాత బెయిల్‌పై విడుదలైన వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జైలు జీవితం తనలో మరింత పట్టుదలను నింపిందని, దాన్ని తాను శిక్షగా కాకుండా ఒక శిక్షణగా భావించానని అన్నారు. అయితే, ఈ సమయంలో తాను ఎదుర్కొన్న ఏకైక ఇబ్బంది బాత్రూంలో జారిపడటమేనని, అది మినహా జైలు జీవితాన్ని పూర్తిగా ఎంజాయ్ చేశానని వ్యాఖ్యానించారు. జైలు నుంచి బయటకు వచ్చిన వెంటనే మీడియాతో మాట్లాడిన ఆయన, కూటమి ప్రభుత్వంపై తన పోరాటం ఇకపై రెట్టింపు ఉత్సాహంతో కొనసాగుతుందని స్పష్టం చేశారు. "నన్ను 18 రోజులు జైల్లో పెడితే భయపడతానని చంద్రబాబు, లోకేశ్ అనుకున్నారేమో. కానీ, ఈ అంబటి రాంబాబు ఎవరికీ భయపడే ప్రశ్నే ఉద్భవించదు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చినప్పుడే జైల్లో ఉండటానికి సిద్ధపడ్డాను. నన్ను జైల్లో పెట్టాలని వారు ఎప్పటినుంచో ప్రయత్నిస్తున్నారు, ఇప్పుడు అవకాశం దొరికింది, లోపల పెట్టారు. కానీ కాలం మళ్లీ తిరిగొస్తుంది. వారు చేసిన పాపానికి మూల్యం చెల్లించక తప్పదు" అని అంబటి హెచ్చరించారు. జైలు తనలో మరింత కసిని, పట్టుదలను పెంచిందని, ఒక్క అడుగు కూడా వెనక్కి వేసే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. తన ఇంటిపై జరిగిన దాడి ఘటనను పూర్తిగా చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారని అంబటి రాంబాబు తీవ్ర ఆరోపణలు చేశారు. "సుమారు ఏడు గంటల పాటు నా ఇంటిపై దుండగులు దాడి చేస్తుంటే పోలీసులు అక్కడే ఉన్నారు. వారి సమక్షంలో, వారి రక్షణలోనే ఈ దాడి జరిగింది. నన్ను రక్షించాల్సిన పోలీసులే 'సార్, మీరు గోడ దూకి పారిపోండి' అని చెప్పారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇది ఆటవిక రాజ్యం కాదా?" అని ఆయన ప్రశ్నించారు. దాడి చేసిన వారికి వెంటనే బెయిల్ వచ్చిందని, బాధితుడినైన తనకు మాత్రం 18 రోజుల తర్వాత బెయిల్ లభించిందని అన్నారు. తన భార్యాబిడ్డలను, మనవళ్లను భయభ్రాంతులకు గురిచేశారని, తనను చంపడానికి కూడా ప్రయత్నించారని ఆరోపించారు.

## మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవం

(మొదటి పేజీ తరువాయి)

సంపద లేదా హోదా వల్ల కాకుండా, జీవితానికి మరణానికి మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలందించడం వల్లే వైద్యులకు సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. లాభాపేక్షతో కాకుండా మానవత్వంతో సేవలందించాలని, రోగుల నమ్మకాన్ని కూడా తమ విధి నిర్వహణలో భాగంగా మార్చుకోవాలని ఆయన యువ వైద్యులకు పిలుపునిచ్చారు. మంగళగిరిలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో జరిగిన స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ప్రతి ఆసుపత్రి ఆవరణలో ఆందోళన, భయం, బాధ ఉంటాయి. అత్యవసర వార్డులోకి వచ్చే రోగి మీ కళ్లలోకి ఎంతో ఆర్తిగా చూస్తాడు. వారు మీ నుంచి కేవలం మందులనే కాదు, నమ్మకాన్ని, భరోసాను ఆశిస్తారు. మీరు ఇచ్చేది కేవలం ప్రిస్క్రిప్షన్ కాదు, వారిలో చిగురింపజేసే ఆశ. కోవిడ్-19 సమయంలో ప్రపంచమంతా ఇళ్లకే పరిమితమైతే, ప్రాణాలను పణంగా పెట్టి వైద్యులు సేవలందించారు. అందుకే సమాజం మిమ్మల్ని దేవుడి తర్వాత అంతటి వారిగా చూస్తుంది" అని అన్నారు.

# అదే మా ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

సౌర, హరిత ఇంధనం వైపు మార్చడమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. 2034 నాటికి హైదరాబాద్‌ను నెట్ జీరో సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. పట్టణాభివృద్ధిలో భాగంగా కార్బన్ ఫుట్ ప్రింట్ ఆడిట్ చేపట్టనున్న తొలి భారత నగరంగా హైదరాబాద్ నిలవబోతుందన్నారు. వచ్చే ఐదేళ్లలో కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)లో దాదాపు పరిశ్రమలు ఉండవని స్పష్టంచేశారు. అభివృద్ధి వ్యూహంలో తయారీ రంగం, పర్యావరణ పరిరక్షణ కీలకంగా మారాయని రేవంత్ అన్నారు. ఏ ఆర్థిక వ్యవస్థకైనా విద్యుత్ ఉత్పాదక వనరులే అసలైన కరెన్సీ అని చెప్పారు. విద్యుదుత్పత్తి, వినియోగం.. అభివృద్ధికి కొలమానంగా నిలుస్తాయని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి లక్ష్యాలను ప్రస్తావిస్తూ.. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే తమ లక్ష్యమన్నారు. రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి కోసం తెలంగాణను క్యూర్, పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (ప్యూర్), రూరల్ అగ్రి రీజియన్ ఎకానమీ(రేర్) జోన్లుగా విభజించామని తెలిపారు. ప్యూర్‌ను అతిపెద్ద తయారీ కేంద్రంగా అభివృద్ధి చేసి 'చైనా+1'కు ప్రత్యామ్నాయంగా రాష్ట్రాన్ని నిలబెట్టడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఈ తయారీ వృద్ధి హరిత ఇంధనం ఆధారంగా సాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో రోజుకు సగటున 16,610 మెగావాట్ల విద్యుత్తును వినియోగిస్తున్నట్లు తెలిపారు. 2034 నాటికి గరిష్ఠ డిమాండ్ 34 వేల మెగావాట్లకు చేరుతుందన్న అంచనా ఉందన్నారు. రాష్ట్రంలో ఉత్పత్తయ్యే విద్యుత్తులో సుమారు 25 శాతం వరకు హరిత వనరుల నుంచే వస్తుందని తెలిపారు. హైదరాబాద్‌లోని క్యూర్ పరిధిలో ఎలక్ట్రిక్ వాహనాలపై పన్నులు తొలగించడంతో వాటి వినియోగం బాగా పెరిగిందన్నారు. అలాగే తెలంగాణలోనే ఈవీల తయారీ కోసం పలు సంస్థలతో చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. ప్రజా రవాణా వ్యవస్థను పర్యావరణహితంగా మార్చే దిశగా 2 లక్షలకు పైగా ఆటోలను రిట్రోఫిట్ చేస్తుండగా, 3000 పైగా ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మారుస్తున్నామని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు, డేటా సెంటర్లు, పరిశ్రమలు హరిత ఇంధనాన్ని కోరుకుంటున్నాయని రేవంత్ తెలిపారు. తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతున్న క్రమంలో వనరుల పెరుగుదలలో హరిత ఇంధనం కీలకంగా ఉండాలన్నదే తన సంకల్పమని తెలిపారు. వాతావరణ మార్పులు, కొవిడ్ ప్రభావాలను ప్రస్తావిస్తూ.. ప్రస్తుత పరిస్థితిని 'క్లైమేట్ ఎమర్జెన్సీ'గా సీఎం అభివర్ణించారు. అభివృద్ధి, పెట్టుబడులు, ఉపాధి, ఉత్పత్తి, వినియోగం పెంపులతో పాటు పర్యావరణ పరిరక్షణకూ ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మూసీ నది పునరుద్ధరణ, చెరువుల సంరక్షణ, వాటర్ గ్రిడ్, వనరుల నిర్వహణ ప్రణాళికలను సీఎం రేవంత్ వివరించారు.



## రంజాన్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- మసీదుల వద్ద మౌలిక వసతుల కల్పనకు ఆదేశం
- ప్రార్థనా సమయాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి
- తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి
- మున్సిపల్ వార్డుల్లో నీటి సరఫరాపై నిఘా

**యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** పవిత్ర రంజాన్ మాసం ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లాలోని మసీదుల వద్ద అవసరమైన అన్ని మౌలిక వసతులు పక్కాగా ఉండేలా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మినీ మీటింగ్ హాలులో నిర్వహించిన శాంతి సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. రంజాన్ మాసం ఏర్పాట్లలో భాగంగా విద్యుత్, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాల ఏర్పాట్లను సమన్వయంతో పూర్తి చేయాలని సంబంధిత శాఖలకు సూచించారు. నమాజ్ సమయాల్లో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. మసీదుల పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలని, తాగునీటి సరఫరా నిరంతరంగా అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ వార్డుల్లో మంచినీటి సరఫరాపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. వీధి దీపాల ఏర్పాటు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. రంజాన్ మాసాన్ని సోదరభావంతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని పేర్కొన్నారు. జిల్లాను మత సామరస్యానికి ప్రతీకగా నిలపాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. రంజాన్ మాసంలో మసీదుల వద్ద పూర్తి భద్రతా బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రార్థనా సమయాల్లో ప్రత్యేకంగా పోలీసు సిబ్బందిని నియమిస్తామని, ప్రజల సహకారంతో సామరస్య వాతావరణాన్ని కొనసాగిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జయమ్మ, భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, పోలీసు అధికారులు, మత పెద్దలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కుంభం అనిల్‌కు ఘన సన్మానం


- మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యతపై కృతజ్ఞతలు
- అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేస్తానన్న ఎమ్మెల్యే
- బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి



**వలిగొండ, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** మున్సిపల్ ఎన్నికల్లో బీసీ వర్గాలకు ప్రాధాన్యత కల్పించి అవకాశాలు ఇచ్చినందుకు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కు బీసీ సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంఘం అధ్యక్షుడు సాయిని యాదగిరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సాయిని యాదగిరి మాట్లాడుతూ.. బీసీ వర్గాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా బీసీలకు మరింత ప్రోత్సాహం, ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అన్ని వర్గాల సమగ్రాభివృద్ధే తన లక్ష్యమని తెలిపారు. బీసీల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## కాంగ్రెస్ నాయకుల కుట్రతోనే ఓటమి

- 7వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కానుగు యాదమ్మ బాలరాజు ఆరోపణ



**చౌటుప్పల్, ఫిబ్రవరి 18 (తొలివెలుగు) :** కాంగ్రెస్ నాయకుల కుట్రతోనే తాను ఓటమి పాలయ్యానని చౌటుప్పల్ మున్సిపాలిటీ 7వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి కానుగు యాదమ్మ బాలరాజు ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడిన ఆమె, 7వ వార్డు ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌంటింగ్ ప్రారంభంలో అధికారులు ప్రకటించిన ఫలితాల్లో తనను విజేతగా ప్రకటించారని, అనంతరం రీకౌంటింగ్ నిర్వహించి కాంగ్రెస్ అభ్యర్థి గెలిచినట్లు వెల్లడించారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు, రిటర్నింగ్ అధికారులతో కుమ్మక్కై బ్యాలెట్ పత్రాలను తారుమారు చేశారని ఆరోపించారు. తనకు వచ్చిన ఓట్లను కాంగ్రెస్ అభ్యర్థికి వచ్చినట్లుగా చూపించారని పేర్కొన్నారు. మున్సిపాలిటీకి సంబంధం లేని కాంగ్రెస్ నాయకులను కౌంటింగ్ హాల్‌లోకి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ఫలితంపై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన రాలేదని వాపోయారు. 7వ వార్డు ఫలితంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు వెల్లడించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన కాంగ్రెస్ నాయకులకు తగిన గుణపాఠం చెప్పాలని కోరారు.


## పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యం





- గణిత ఉపాధ్యాయుడిగా మారిన కలెక్టర్ హనుమంతరావు
- పెదకందుకూరు ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

**యాదగిరిగుట్ట, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** పదవ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు కష్టపడి చదివి నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం యాదగిరిగుట్ట మండలం పెద్ద కందుకూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య, పదవ తరగతి విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. సబ్జెక్టుల వారీగా పాఠ్యాంశాలు పూర్తయ్యాయా అని ఆరా తీశారు. ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారా, ఉదయం విద్యార్థులకు మేల్కొలుపు పిలుపు ఇస్తున్నారా అని ఉపాధ్యాయులను ప్రశ్నించారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో నేరుగా మట్లాడి గణితంలో ప్రశ్నలు అడిగి వారి ప్రతిభను పరీక్షించారు. కొంతమందికి బోర్డు పై స్వయంగా సమస్యలు పరిష్కరించి చూపిస్తూ అర్థమయ్యే విధంగా బోధించారు. దీంతో కలెక్టర్ స్వయంగా గణిత ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు మార్గనిర్దేశం చేసిన దృశ్యం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పదవ తరగతి జీవితంలో ఉన్నత స్థాయికి వెళ్లే తొలి మెట్టు అని పేర్కొన్నారు. వెనుకబడిన సబ్జెక్టులను పునర్విమర్శ చేసి స్వయంగా రాయడం ద్వారా సాధన చేయాలని సూచించారు. బీద కుటుంబాల నుంచి ఉన్నత స్థాయికి ఎదగడానికి చదువే ప్రధాన మార్గమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన అందుతున్నదని, గ్రామస్థులు మరియు తల్లిదండ్రుల్లో ప్రభుత్వ విద్యపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోనే చేరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



## అన్నదాతపై అదనపు 'వడ్డింపు'



### రామన్నపేటలో యూరియా నిలువు దోపిడీ!
### ఎంఆర్‌పీకి మంగళం.. బస్తాకు రూ.30 అదనపు వసూలు
### రవాణా, హమాలీ చార్జీల పేరిట డీలర్ల దందా
### ప్రశ్నిస్తే 'సరుకు లేదు' అంటూ సాకులు
### పట్టించుకోని వ్యవసాయ శాఖ.. అన్నదాత ఆవేదన

**రామన్నపేట, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** సాగు సీజన్ ప్రారంభమై రైతు పొలం బాట పడితే చాలు.. అదను చూసి అక్రమార్కులు పడగ విప్పుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో ప్రస్తుతం ఎరువుల డీలర్లు 'యూరియా'ను కాసుల వర్షం కురిపించే వనరుగా మార్చుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గరిష్ట చిల్లర ధర (ఎంఆర్‌పీ) నిబంధనలు ఇక్కడ కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రతి యూరియా బస్తాపై కళ్లు చెదిరే రీతిలో అదనపు వసూళ్లకు పాల్పడుతూ రైతుల రక్తాన్ని పిండుతున్నారు.

#### నిబంధనలు గాలికి.. వసూళ్లు యథేచ్ఛగా..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. ఎరువుల బస్తాపై ముద్రించిన ధర కంటే ఒక్క పైసా కూడా అదనంగా వసూలు చేయకూడదు. కానీ రామన్నపేట మండలంలోని పలు ఫెర్టిలైజర్ షాపుల్లో సీన్ రివర్స్‌లో ఉంది. ఒక్కో యూరియా బస్తాపై ఏకంగా రూ. 30 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. "పైసలు ఇస్తేనే బస్తా.. లేదంటే పక్కకు తప్పుకో" అన్నట్లుగా డీలర్ల తీరు ఉంది. ఆన్‌లైన్ విక్రయ వ్యవస్థ (పీవోఎస్) అమల్లో ఉన్నప్పటికీ, రికార్డుల్లో ఎంఆర్‌పీ ధరనే చూపిస్తూ.. బయట మాత్రం నగదు రూపంలో ఈ అదనపు బాదుడు కొనసాగుతోంది.

#### సాకుల పేరిట దోపిడీ

రైతులు ఈ అదనపు ధర గురించి ప్రశ్నిస్తే, డీలర్ల దగ్గర సిద్ధంగా ఉన్న సమాధానం 'ఖర్చులు'. "మాకు లారీ రవాణా ఖర్చులు పెరిగాయి, హమాలీలకు అదనంగా ఇవ్వాల్సి వస్తోంది.. ఆ భారమంతా మేమే మోయాలా?" అంటూ ఎదురుదాడికి దిగుతున్నారు. నిజానికి కంపెనీ నుంచి డీలర్ పాయింట్ వరకు వచ్చే రవాణా ఖర్చులను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకునే ఎంఆర్‌పీని నిర్ణయిస్తుంది. కానీ డీలర్లు మాత్రం ఆ ఖర్చులను కూడా పేద రైతుపైనే నెట్టేస్తున్నారు. అదనపు డబ్బులు ఇవ్వని పక్షంలో కృత్రిమ కొరతను సృష్టించి "స్టాక్ లేదు" అంటూ రైతులను వెనక్కి పంపుతున్నారు.

#### ఆందోళన బాటలో అన్నదాత

ఇప్పటికే విత్తనాలు, పెస్టిసైడ్స్, సాగు కూలీల ఖర్చులతో సతమతమవుతున్న రైతులకు ఈ యూరియా అదనపు భారం 'గోరుచుట్టుపై రోకటి పోటు'లా మారింది. జిల్లా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఎంఆర్‌పీ ధరకే ఎరువులు విక్రయించేలా చర్యలు తీసుకోకపోతే, రోడ్లపైకి వచ్చి ఆందోళన చేస్తామని హెచ్చరిస్తున్నారు.

#### అధికారుల నిర్లక్ష్యం.. డీలర్ల ఇష్టారాజ్యం

మండల వ్యవసాయ అధికారి (ఏఓ), సంబంధిత శాఖాధికారుల పర్యవేక్షణ లోపం ఈ అక్రమాలకు ప్రధాన కారణమని రైతులు ఆరోపిస్తున్నారు. డీలర్ల వ్యవహారంపై ఫిర్యాదులు అందుతున్నా అధికారులు కనీసం అటువైపు కన్నెత్తి చూడటం లేదని, తనిఖీలు నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి. అధికారుల మౌనం డీలర్లకు వరంగా మారిందని, అందుకే వారు బరితెగించి వసూలు చేస్తున్నారని మండల రైతాంగం మండిపడుతోంది.



## నాగారంలో బెల్ట్ సెగ.. నిర్వాహకులకు హెచ్చరిక

- గ్రామంలో మద్యం విక్రయాలపై యువత ఆగ్రహం
- మూడు రోజుల్లోగా నిలిపివేయాలని హెచ్చరిక
- నిర్వాహకులకు నాగారం యువత అల్టిమేటం
- కుటుంబాలు ఆగమైతున్నాయని ఆవేదన

**వలిగొండ, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** వలిగొండ మండలంలోని నాగారం గ్రామంలో అక్రమంగా కొనసాగుతున్న మద్యం బెల్ట్ షాపులపై గ్రామ యువత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే విక్రయాలు నిలిపివేయాలని నిర్వాహకులకు అల్టిమేటం జారీ చేసింది. గ్రామంలో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతుండటంతో యువత మద్యానికి బానిసై జీవితాలు దెబ్బతింటున్నాయని, అనేక కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో బెల్ట్ షాపు నిర్వాహకుల ఇళ్ల ముందుకు చేరుకుని నిరసన వ్యక్తం చేశారు. నిర్వాహకులతో వాగ్వాదానికి దిగిన యువకులు తక్షణమే బెల్ట్ షాపులు మూసివేయాలని డిమాండ్ చేశారు. మూడు రోజుల్లోగా దుకాణాలు నిలిపివేయాలని, లేనిపక్షంలో గ్రామంలోని మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అవసరమైతే కఠిన చర్యలకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## పేద ఆడబిడ్డలకు 'కళ్యాణ లక్ష్మీ' కొండంత అండ

- 54 మంది లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ
- ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి

**వలిగొండ, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** నిరుపేద ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఆర్థిక భరోసా కల్పించే కళ్యాణ లక్ష్మి పథకం పేద కుటుంబాలకు కొండంత అండగా నిలుస్తోందని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 54 మంది లబ్ధిదారులకు మంజూరైన 53 కళ్యాణ లక్ష్మి చెక్కులు, ఒక షాదీ ముబారక్ చెక్కును ఎమ్మెల్యే స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, నిరుపేద కుటుంబాల అభ్యున్నతి కోసం పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద ఆడబిడ్డల భవిష్యత్తు భరోసాగా ఉండేలా కళ్యాణ లక్ష్మి పథకం అమలవుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో శోభారాణి, ఎంపీడీవో జలంధర్ రెడ్డి, ఎమ్మార్వో దశరథ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు సముచిత స్థానం

- ముున్సిపల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్‌కు సన్మానం
- బీసీలకు ప్రాధాన్యతనిచ్చిన ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి కృతజ్ఞతలు
- వచ్చే స్థానిక ఎన్నికల్లోనూ బీసీలకే పెద్దపీట: వర్కాల రాము గౌడ్

**చౌటుప్పల్, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్‌ను బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించారు. వర్గాల రాము గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పట్టణానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించినందుకు మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, రాష్ట్ర ప్రభుత్వానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. బీసీల అభివృద్ధికి ఆయన కృషి చేస్తున్నారని కొనియాడారు. రానున్న ఎంపిటిసి, జెడ్పిటిసి ఎన్నికల్లో బీసీలకు జనాభా ప్రాతిపదికన స్థానాలు కేటాయించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుర్రం శ్రీనివాస్, అన్నమోని శివాజీ, యాట సంతోష, రాకేష్, రోహిత్, రాజేష్, వర్కాల ప్రసాద్, శివశంకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.o

# చౌటుప్పల్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతా

- చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన పావని రమేష్ గౌడ్
- పలువురు కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం

**చౌటుప్పల్, ఫిబ్రవరి 18 (తొలివెలుగు):** చౌటుప్పల్ మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని నూతన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఆమె పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గుత్తా వెంకట్రాంరెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు కొయ్యడ శేఖర్ గౌడ్, ఊదరి యాదయ్య, గడ్డం ఇందిర, అలాగే బీజేపీ కౌన్సిలర్లు పోలేపల్లి లక్ష్మీముత్తయ్య, ఆలె శ్రీలత చిరంజీవి, బుడ్డ సురేష్ ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం నూతన కౌన్సిలర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం, తాగునీరు, మౌలిక వసతుల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



# దానంపై అనర్హత వేటు తప్పదు

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ కచ్చితంగా అనర్హత వేటు వేస్తారనే నమ్మ కం, విశ్వాసం ఉన్నదని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలిపారు. దానం నాగేందర్ పార్టీ మారిండు అనేందుకు అవసరమైన సాక్ష్యాలను స్పీకర్‌కు అందించామని చెప్పా రు. దానం కాంగ్రెస్ బీఫామ్‌పై సికింద్రాబాద్ ఎంపీగా పోటీచేశారని, ఇందుకు సం బంధించిన ఆధారాలను అందించామని తెలిపారు. ఇంతకన్నా సాక్ష్యం ఇంకేం కా వాలని అన్నారు. న్యాయం గెలుస్తుందని, ఖైరతాబాద్‌లో ఉపఎన్నిక ఖాయమని స్పష్టంచేశారు. రాజ్యాంగాన్ని కాపాడాలని స్పీకర్‌ను కోరినట్టు తెలిపారు. దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ బుధవారం తన చాంబర్ లో విచారణ చేపట్టారు. పిటిషనర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని దానం తర ఫు న్యాయవాదులు క్రాస్ ఎగ్జామిన్ చేశా రు. సుమారు ఐదు గంటలపాటు పలు అంశాలపై ప్రశ్నలు అడిగారు. అనంతరం కౌశిక్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వి చారణలో భాగంగా ప్రతి ప్రశ్నకు సమాధా నం చెప్పానని తెలిపారు. కాంగ్రెస్ నాయకురాలు దీపాదాస్‌మున్షీ, టీపీసీసీ ప్రెసిడెం ట్ రేవంత్‌రెడ్డి సమక్షంలో 2024 మార్చి 15న దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకొని ఆ పార్టీలో



చేరినట్టు తెలిపారు. 2024 మార్చి 21న కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో సికింద్రాబాద్ అభ్యర్థిగా నాగేందర్‌ను ప్రకటించినట్టు చెప్పారు. కాంగ్రెస్ నుంచి పోటీ చేసి 4.29లక్షల ఓట్లు పొందారని తెలిపా రు. ఇందుకు సంబంధించిన ఆధారాలను స్పీకర్‌కు అందించినట్టు చెప్పారు. ఇది క్లియర్‌కట్ కేసు అని, దానంపై అనర్హత వేటు వేయాలని కోరారు. ఓ వైపు రాజ్యాంగాన్ని బీజేపీ తుంగలో తొక్కుతున్నదని రాహుల్‌గాంధీ ఆరోపిస్తున్నారని, మరి ఇక్కడ రేవంత్‌రెడ్డి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి పిటిషన్‌పై స్పీకర్ గురువారం విచారణ చేపట్టనున్నారు.

# ఇబ్రహీంపట్నం చైర్మన్ ఎన్నికకు లైన్‌క్లియర్

**హైదరాబాద్,(తొలివెలుగు):** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఎన్నికలకు హైకోర్టు అనుమతించింది. ఎన్నికలను నిలిపివేస్తూ మంగళవారం జారీచేసిన మధ్యంతర ఉత్తర్వులను బుధవారం రద్దుచేసింది. 19వ వార్డు కౌన్సిలర్ ఆకుల యాదగిరి స్వేచ్ఛగా తిరిగేలా రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. యాదగిరి సెల్‌ఫోన్, ఎన్నిక సర్టిఫికెట్ అందజేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని స్పష్టంచేసింది. మాజీ ఎమ్మెల్యే, అతని కుమారుడిపై వచ్చిన తీవ్రమైన ఆరోపణలు, రాష్ట్ర యంత్రాంగం ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించలేదన్న వాదనల వ్యవహారం ఈ పిటిషన్ పరిధిలోకి రావని తెలిపింది. కౌన్సిలర్‌గా ఎన్నికైన తన తండ్రి యాదగిరి కనిపించడం లేదని, పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ ప్రయోజనం లేదంటూ ఆయన కొడుకు ఆకుల హరికాంత్ దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్ ధర్మాసనం బుధవారం మరోసారి విచారించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది స్వరూప్ ఊరిళ్ల వాదనలు వినిపిస్తూ యాదగిరిని కోర్టు నియమించిన అమికస్ క్యూరీ ఇంటి వద్ద హాజరుపరిచామని చెప్పారు. యాదగిరి తన స్టేట్‌మెంట్‌లో మాజీ ఎమ్మెల్యే అనుచరులు వేధించారని, ఏపీలోని బాపట్ల జిల్లా చీరాలకు బలవంతంగా కారులో తరలించారని చెప్పారని తెలిపారు. ఈ నెల 13న చీరాలకు యాదగిరి కుమారుడు వచ్చినప్పటికీ కలుసుకునే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. సీనియర్ న్యాయవాది రఘు వాదనలు వినిపిస్తూ, కౌన్సిల్‌లో 24 మంది సభ్యులుండగా బీఆర్‌ఎస్ తరఫున 13 మంది గెలిచారని, బీజేపీ కౌన్సిలర్లు ఇద్దరిలో ఒకరు, ఇండిపెండెంట్ కౌన్సిలర్ ఒకరు చైర్మన్ ఎన్నికకు ఓట్లు చేశారని తెలిపారు. ఈ పరిస్థితుల్లో యాదగిరి లేకపోయినా బీఆర్‌ఎస్‌కు ఇబ్బంది లేదని చెప్పారు. ఎన్నికను జాప్యం చేయడానికే కిడ్నాప్ నాటకానికి తెరతీశారని తెలిపారు. ఇదంతా యాదగిరి ఆడుతున్న నాటకమని అన్నారు. యాదగిరి మున్సిపల్ ఎన్నికలకు హాజరయ్యారని తెలిపారు. అకడున్న పోలీసు ఉన్నతాధికారులకు గానీ, రిటర్నింగ్ అధికారికిగానీ ఎలాంటి ఫిర్యాదు చేయలేదని చెప్పారు. మున్సిపల్ చైర్మన్‌గా తనకు అవకాశం ఇవ్వలేదన్న కారణంతోనే యాదగిరి బీఆర్‌ఎస్ నేత, ఆయన కుమారుడిపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. మంగళవారం దాదాపు నాలుగైదు గంటలపాటు కాంగ్రెస్ నేతలతో పాటు యాదగిరి పోలీసుల వద్దే ఉన్నారని, అప్పుడు కూడా తనను బీఆర్‌ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే, ఇతరులు కిడ్నాప్ చేశారని ప్రకటించలేదని తెలిపారు. అధికారపార్టీ నేతలు చెప్పినట్టు చేస్తూ కిడ్నాప్ డ్రామా ఆడారని, యాదగిరి చెప్పేదంతా ఒక డ్రామా అని ఆరోపించారు. బీఆర్‌ఎస్‌కు 15 మంది కౌన్సిలర్ల బలం ఉందని, మున్సిపాల్టీ అధికార పగ్గాలు అందుకోవాలంటే మ్యాజిక్ ఫిగర్ 13 అని, ఏ దశలోనూ యాదగిరి ఓటు బీఆర్‌ఎస్‌కు అవసరం లేదని వివరించారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది శ్రీధర్‌రెడ్డి స్పందిస్తూ.. ఎన్నిక ప్రక్రియ దాదాపు పూర్తయిందని, కోర్టు ఆదేశాల వల్ల మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్ ఫలితాలను వెల్లడించలేదని చెప్పారు. యాదగిరి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి నివేదిక సమర్పించినట్టు అమికస్‌క్యూరీ రామకృష్ణారెడ్డి తెలిపారు. వాదనల అనంతరం ధర్మాసనం.. హెబియస్ కార్పస్ పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది. ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక ప్రక్రియను నిలిపివేస్తూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను రద్దు చేస్తున్నట్టు తెలిపింది.

# పురుగుల అన్నం తినలేకపోతున్నం

- రోడ్డెక్కిన పీజీ కళాశాల విద్యార్థులు
- మంత్రి ఇలాకా కొల్లాపూర్‌లో ఆందోళన
- శ్రీశైలం హైవేపై గురుకుల విద్యార్థుల నిరసన
- నాణ్యతలేని భోజనం పెడుతున్నారని ఆగ్రహం

**వెల్దండ(తొలివెలుగు):** 'కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్యావ్యవస్థ, హాస్టళ్లు గాడి తప్పుతున్నాయి. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదు.. ఇచ్చే భోజనం కూడా నాణ్యతగా ఉండటంలేదు.. రుచిలేని, పురుగుల భోజనం తినలేక కడుపులు మాడ్చుకుంటున్నాం' అని విద్యార్థులు ఆవేదన వ్యక్తంచేస్తూ బుధవారం రోడ్డెక్కారు. మంత్రి జూపల్లి ఇలాకా నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ పట్టణంలోని పీజీ కళాశాల హాస్టల్ విద్యార్థులు హైవే-167కేపై వండిన భోజనం గిన్నెలతో ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీజీ కళాశాల ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా నేటికీ హాస్టల్‌లో మెనూ పాటించడంలేదని, రుచిలేని భోజనం అందిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. భోజ నం సరిగాలేక జనవరి 26న జెండా పండుగకు హాజరైన కొందరు విద్యార్థులు స్పృహతప్పి పడిపోయారని గుర్తుచేశారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని నెలరోజుల క్రితమే ప్రిన్సిపాల్ మార్క్ ఫెలోనియస్ దృష్టికి తీసుకెళ్లగా. పట్టించుకోకుండా.. ఏం చేస్తారో.. చేసుకోండంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలీసులు, అధికారులు వచ్చి విద్యార్థులను అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. చివరకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. 'పురుగుల అన్నం పెడుతుండ్రు.. అడిగితే బూతులు తిడుతుండ్రు.. ఈ అన్నం మాకొద్దు'.. అంటూ నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని ఎస్సీ గురుకుల విద్యార్థులు హైదరాబాద్-శ్రీశైలం హైవేపై బైఠాయించారు. భోజనం నాణ్యతగా.. రుచిగా లేదని.. అన్నంలో పురుగులు వస్తున్నాయని ప్రిన్సిపాల్‌ను అడిగితే పురుగులు తీసేసి తినాలంటూ ఉచిత సలహా ఇస్తున్నారని, ప్రశ్నించిన వారిని టార్గెట్ చేసి దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు. పాఠశాలలో నిర్వహించే వివిధ కార్యక్రమాలకు సైతం డబ్బు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రిన్సిపాల్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ధర్నాతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. సర్పంచ్ యాదమ్మ, తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఎస్సై కురుమూర్తి, పోలీసులు చేరుకొని సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



# తెలంగాణ ఆత్మగౌరవం..ఢిల్లీకి తాకట్టు!

**హైదరాబాద్,(తొలివెలుగు):** తెలంగాణ ప్రజల స్వీయ అస్తిత్వాన్ని, ఆత్మగౌరవాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వీధుల్లో తాకట్టు పెడుతున్నారని బీఆర్‌ఎస్ డిప్యూటీ ఫ్లోర్‌లీడర్, మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణ క్యాబినెట్‌ను ఢిల్లీకి పిలిపించుకొని కాంగ్రెస్ అధిష్ఠానం చేయబోయే సమీక్షపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ మేరకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు, కర్ణాటక సీఎం సిద్ధరామయ్యలకు హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. 'తెలంగాణ పోరాటాల గడ్డ.. ఇది ఎన్నటికీ ఢిల్లీకి గులాం కాదు.. ఈ గడ్డ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టాలని చూస్తే మీ కాంగ్రెస్‌ను చరిత్ర క్షమించదు' అని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజాద్రోహానికి పాల్పడినందుకు ముందు క్షమాపణలు చెప్పిన తర్వాతే సమీక్షలు ప్రారంభించాలని కాంగ్రెస్ అగ్రనేతలకు హరీశ్‌రావు హితవుచెప్పారు. 'ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై సమీక్ష నిర్వహిస్తున్న మీకు, ఎన్నికల సమయంలో తెలంగాణకు వచ్చి ఇచ్చిన మీ హామీలను గుర్తుచేస్తున్నాను. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, ఇప్పటికే రెండున్నరేండ్లు గడిచింది. మిగిలిన కొద్దికాలంలో అయినా మీరు ఇచ్చిన హామీలకు కట్టుబడి త్వరగా నెరవేర్చాలని, ఆ దిశగా మీ ముఖ్యమంత్రికి హితబోధ చేయాలని కోరుతున్నా. తొలి అసెంబ్లీ సమావేశాల్లోనే ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పిస్తామని మీరు హామీ ఇచ్చారు. తీరా చూస్తే బిల్లు 'నిల్ అయింది'. ప్రజల విశ్వాసం కిల్ అయింది. ఈ ప్రజా విద్రోహానికి క్షమాపణలు చెప్తూ మీ సమీక్ష ప్రారంభించండి' అని సూచించారు. 'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగ నియామకాలు చేస్తామని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి క్రమం తప్పకుండా ఖాళీలు భర్తీ చేస్తామని, నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తామని, 18 ఏండ్లు పైబడిన ప్రతి యువతికీ ఎలక్ట్రిక్ స్కూటర్లు ఇస్తామని సరూర్‌నగర్ స్టేడియంలో ఆర్భాటంగా ప్రకటించారు. అంతే సౌకర్యంగా విస్మరించారు. ఇందులో ఏ ఒక హామీ అమలు కాకపోగా, నిరుద్యోగుల మీద దమనకాండ జరుపుతున్నది ఘనత వహించిన మీ రేవంత్ ప్రభుత్వం. యువత, నిరుద్యోగుల నమ్మకాన్ని వమ్ము చేసి, వాళ్ల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న మీ కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరికి మీరు బాధ్యులు కాదా? దీనిపై సమీక్ష చేస్తారా? ప్రజలకు సమాధానం చెప్తారా?' అని హరీశ్‌రావు ప్రశ్నించారు.



'ఎస్సీల రిజర్వేషన్లు 18శాతానికి పెంచుతామని, అన్ని ప్రభుత్వ ప్రొక్యూర్‌మెంట్లలో, కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18శాతం, ఎస్టీలకు 12శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లో అనేక హామీలు గుప్పించారు. అమలుచేయక తప్పించారు. దళిత బిడ్డలను దగా చేసి ఓట్లు దండుకున్న మీ నమ్మక ద్రో హంపై ఏమని సమీక్ష చేసుకుంటారు? ఇంకా చెప్పాలంటే 420 హామీలను ప్రస్తావించాలి. రాష్ట్రంలో ప్రజలు నానా రకాల పాట్లు పడుతున్నారు. పాలన గాలికొదిలి ఢిల్లీకి చకర్లు కొడుతున్న సీఎం వైఖరితో తెలంగాణ బతుకు తెల్లారిపోతున్నది. మీ సీఎం తీరు రాష్ట్రానికి గ్ర హపాటుగా మారిందని హరీశ్‌రావు గుర్తుచేశారు. 'బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలుచేసిన కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్, దళితబంధు, బీసీ బంధు, కంటివెలుగు, చేపల పంపిణీ, గొర్రెల పంపిణీ, మన ఊరు-మన బడి, సీఎం బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్, రంజాన్ తోఫా, క్రిస్మస్ తోఫా, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి వంటి అనేక సంక్షేమ పథకాలను వచ్చీరాగానే మీ సీఎం రేవంత్‌రెడ్డి నిలిపేశారు. ప్రజాసంక్షేమ దీపాన్ని ఆర్పేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయక 20లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వి ద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చింది మీ కాంగ్రెస్ పాలన. కేసీఆర్ పాలనలో చదువులమ్మ గుడులుగా పేరుపొందిన గురుకులాల్లో నేడు చావుడప్పు మోగిస్తున్నది మీ కాంగ్రెస్ ప్రభుత్వం. మీ ప్రభుత్వ పాపాలకు నిష్కృతి ఏమిటో సమీక్షించండి' అని హరీశ్‌రావు కాంగ్రెస్ అగ్రనేతలకు హితవుపలికారు.




## ఈవీలపై మెర్సిడెస్ బెంజ్ ఫోకస్

### కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్

హైదరాబాద్: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ మెర్సిడెజ్ బెంజ్ క్రమంగా తన పంతాను మార్చుకుంటున్నది. లగ్జరీ కార్లతోపాటు విద్యుత్‌తో నడిచే వాహనాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇప్పటికే కొన్ని వాహనాలను విడుదల చేసినప్పటికీ ఇక నుంచి విడుదలయ్యేవాటిలో వీటికి అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు కంపెనీ ఎండీ, సీఈవో సంతోష్ అయ్యర్ తెలిపారు. హైదరాబాద్‌తోపాటు తెలంగాణ, ఏపీలలో ఈవీ కార్లకు ఆదరణ క్రమంగా పెరుగుతున్నదని, ఇది వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడానికి దోహదం చేయనున్నదన్నారు. కంపెనీ మొత్తం విక్రయాల్లో ఈవీల వినిమయం చాలా తక్కువగా ఉన్నదని, ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్నదన్నారు. వచ్చే ఏడాది అంతర్జాతీయ మార్కెట్లోకి 40 కొత్త మాడళ్లను విడుదల చేయనున్నట్లు ప్రకటించిన ఆయన..వీటిలో కొన్ని దేశీయ మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకురానున్నట్లు ప్రకటించారు.మరోవైపు, ద్వితీయ శ్రేణి నగరాలతోపాటు తృతీయ శ్రేణి నగరాలపై సంస్థ ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఇటీవలకాలంలో మెట్రో నగరాలతోపాటు చిన్న స్థాయి నగరాల్లోనూ లగ్జరీ కార్ల అమ్మకాలు టాప్‌గేర్‌లో దూసుకుపోతున్నాయన్నారు.పూణెకు సమీపంలో రూ.3 వేల కోట్ల పెట్టుబడితో ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ యూనిట్ సామర్థ్యం ఏడాదికి 20 వేల యూనిట్లు.ప్రస్తుతం భారత్‌లో సంస్థ 25 మాడళ్లను విక్రయిస్తుండగా, వీటిలో 11 దేశీయంగా తయారవుతుండగా, మిగతా మాడళ్లను దిగుమతి చేసుకుంటున్నది.ఈ ఏడాది కొత్తగా 16 టచ్‌పాయింట్లను ప్రారంభించింది. దీంతో టచ్‌పాయింట్ల సంఖ్య 140కి పైకి చేరుకున్నాయి.కంపెనీ మొత్తం వాహన విక్రయాల్లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వాటా 15 శాతంగా ఉన్నది. అలాగే 10 విక్రయ కేంద్రాలు ఉన్నాయి.

## పెట్టుబడి లేకుండానే వ్యాపారం.. 'డబ్ల్యూకామర్స్' వెల్లడి

హైదరాబాద్: సరుకులు నిల్వ చేయాల్సిన అవసరం లేదు..అంతేకాదు పైసా పెట్టుబడి లేకుండానే వ్యాపారం చేయవచ్చునని డిజిటల్ కామర్స్ సేవల సంస్థ డబ్ల్యూకామర్స్ వెల్లడించింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను ఆసరాగా చేసుకొని చిరు వ్యాపారులు, వ్యక్తులు ఎవరైనా వ్యాపారం ప్రారంభించుకోవచ్చును. విక్రేతల పేరుతో కంపెనీ ఒక ఆన్‌లైన్ స్టోర్‌ను క్రియేట్ చేస్తున్నది. సోషల్ మీడియాలో ఈ ఆన్‌లైన్ స్టోర్‌కు సంబంధించి లింక్/క్యూఆర్‌కోడ్‌ను పోస్ట్ చేయడం లేదా బంధువులు, స్నేహితులకు షేర్ చేసిన చాలు. కంపెనీ ఆఫర్ చేసే ఉత్పత్తులను ఎవరు కొనుగోలు చేసినా..విక్రేతకు 20-40 శాతం వరకు లాభం రానున్నది. ఇలా బుకింగ్ చేసుకున్న వస్తువుల డెలివరీ బాధ్యతలను కంపెనీ తీసుకుంటుందని డబ్ల్యూకామర్స్ కో-ఫౌండర్, సీవోవో శ్రీధర్ శ్రీరామనేని తెలిపారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా 22 వేలకు పైగా యాక్టివ్ ఆన్‌లైన్ స్టోర్స్ ఉన్నాయన్నారు. హెల్త్, వెల్‌నెస్, బ్యూటీ, పర్సనల్ కేర్, హోమ్ ఎసెన్షియల్ విభాగాలకు చెందిన 40కి పైగా బ్రాండ్ నుంచి 600కి పైగా ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు.

## అమెరికన్ బ్రాండ్ కారుపై రూ.2 లక్షల డిస్కౌంట్!

చాలారోజుల నిరీక్షణ తరువాత.. అమెరికన్ కార్ల దిగ్గజం టెస్లా భారతదేశంలో 'మోడల్ వై' లాంచ్ చేసింది. అయితే ప్రారంభం నుంచి దీని అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో కార్లన్నీ.. షోరూంలలోనే ఉండిపోవాల్సి వచ్చింది. దీనిని దృష్టిలో ఉంచుకుని సంస్థ.. వీటి అమ్మకాలను మెరుగుపరచడానికి భారీ ఆఫర్ ప్రకటించింది. టెస్లా ఇండియా.. ప్రస్తుతం ఉన్న స్టాక్ అమ్ముకోవడానికి మోడల్ కొనుగోలుపై రూ. 2 లక్షల వరకు తగ్గింపును అందిస్తోంది. ఈ ఆఫర్ స్టీల్త్ గ్రేలో పూర్తిగా నలుపు రంగు ఇంటీరియర్‌తో కూడిన స్టాండర్డ్ రేంజ్ వేరియంట్‌కు పరిమితం చేసినట్లు తెలుస్తోంది. ప్రారంభంలో కంపెనీ 300 మోడల్ వైలను దిగుమతి చేసుకుంది. అయితే ఇప్పటికి కూడా 100 యూనిట్లను కూడా అమ్మలేకపోయింది. టెస్లా అమ్మకాలు కేవలం భారతదేశంలో మాత్రమే కాకుండా.. ప్రపంచంలోని చాలా దేశాల్లో తగ్గుముఖం పట్టాయి. 2025లో కూడా వరుసగా రెండవ సంవత్సరం సేల్స్ తగ్గినట్లు గణాంకాలు పేర్కొన్నాయి. ఇదే సమయంలో చైనా బ్రాండ్ బీవైడీ అమ్మకాలు గణనీయంగా పెరిగాయి. పెరుగుతున్న పోటీ ఒ కొన్ని కార్ మార్కెట్లలో సబ్సిడీలు తగ్గడం వల్ల అమెరికా, యూరప్, చైనా అంతటా టెస్లా వాటా తగ్గిపోయిందని కొన్ని నివేదికలు చెబుతున్నాయి.

## పల్సర్ బైక్ ప్రియం

న్యూఢిల్లీ: బజాజ్ పల్సర్ కొనుగోలుదారులకు షాకిచ్చింది సంస్థ. పల్సర్ బైకుల ధరలను రూ.461 నుంచి రూ.1,460 వరకు పెంచింది. ఉత్పత్తి వ్యయం పెరగడం వల్లనే ఎంపిక చేసిన పల్సర్ బైకుల ధరలను సవరించినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. కంపెనీ మొత్తం విక్రయాల్లో 60 శాతం వాటా కలిగిన పల్సర్ అమ్మకాలపై ఎలాంటి ప్రభావం చూపదని, సంస్థపై అదనపు భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా వాహన ధరలను స్వల్పంగా పెంచినట్టు తెలిపారు. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో బజాజ్ పల్సర్ 125 సీసీ బైకు ఎంట్రీ లెవల్ మాడల్ రూ.778 నుంచి రూ.1,020 వరకు సవరించింది. అలాగే నియాన్ సింగిల్ సీటు రకంను రూ.891 పెంచింది.

# ఆంక్షలతో భారత ఓఎంసీలకు రిస్కేమీ లేదు

### వాటి మార్జిన్లపై ప్రభావం ఉండదు

### ఫిచ్ రేటింగ్స్ అంచనాలు

న్యూఢిల్లీ: రష్యన్ ఆయిల్ కంపెనీలైన రోజ్‌నెఫ్ట్, ల్యూక్ ఆయిల్‌పై అమెరికా ఆంక్షలు విధించడం, రష్యా చమురు ఆధారిత రిఫైనరీ ఉత్పత్తులపై ఐరోపా సమాఖ్య (ఈయూ) నిషేధం విధించడం భారత ప్రభుత్వరంగ చమురు సంస్థల మార్జిన్లు, పరపతి సామర్థ్యాలపై పెద్దగా ప్రభావం ఉండదని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. అయితే, ఈ ఆంక్షలు ఎంత కాలం పాటు కొనసాగుతాయి, ఎంత కఠినంగా అవి అమలవుతాయన్న దాని ఆధారంగా తుది ప్రభావం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. 2025 జనవరి నుంచి ఆగస్ట్ మధ్య కాలంలో భారత చమురు దిగుమతుల్లో మూడింట ఒక వంతు రష్యా నుంచే ఉండడం గమనార్హం. రష్యా డిస్కౌంట్ రేటుపై చమురును విక్రయించడంతో ప్రభుత్వరంగ చమురు సంస్థల లాభదాయకత గణనీయంగా మెరుగుపడింది. సాధారణంగా మధ్యప్రాచ్య దేశాలపై చమురు దిగుమతుల కోసం భారత్ ఎక్కువగా ఆధారపడేది. కానీ, 2022లో ఉక్రెయిన్‌పై రష్యా దాడికి దిగిన తర్వాత ఈ పరిస్థితుల్లో చాలా మార్పు వచ్చింది. పాశ్చాత్య దేశాల ఆంక్షల నేపథ్యంలో మార్కెట్ ధర కంటే తక్కువకే చమురును




రష్యా ఆఫర్ చేయడంతో భారత కంపెనీలు అటువైపు మళ్లాయి. దీంతో భారత చమురు దిగుమతుల్లో అంతకుముందు రష్యా వాటా ఒక శాతంగా ఉంటే, 40 శాతానికి పెరిగింది.

**చమురు ధరలు తక్కువ స్థాయిలోనే..**

ప్రపంచ చమురు ఉత్పత్తి సామర్థ్యం తగినంత ఉండడం ధరలను అదుపులోనే ఉంచుతుందని, బ్రెంట్ బ్యారెల్ ధర 2026లో సగటున 65 డాలర్ల స్థాయిలో ఉండొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపంది. 2025లో బ్రెంట్ బ్యారెల్ 70 డాలర్లుగా ఉండడాన్ని ప్రస్తావించింది. ఇక రష్యా చమురు ఆధారిత ఉత్పత్తులను ఈయూకి ఎక్కువగా ఎగుమతి చేస్తున్న భారత్‌లోని ప్రైవేటు చమురు సంస్థలు రిస్కను ఎదుర్కోవాల్సి రావొచ్చని ఫిచ్ రేటింగ్స్ తెలిపింది. మూడు ప్రభుత్వరంగ చమురు సంస్థల (ఐవోసీ, బీపీసీఎల్, హెచ్‌పీ) ఇష్యూయర్ డిఫాల్ట్ రేటింగ్‌లు బలంగా ఉన్నట్టు తెలిపింది. ఎల్‌పీజీ సబ్సిడీల నష్టాన్ని ప్రభుత్వం ప్రకటించిన రూ.30వేల కోట్ల ప్యాకేజీతో గట్టెక్కొచ్చని పేర్కొంది. స్థూల రిఫైనింగ్ మార్జిన్ 2025%-%26లో బ్యారెల్‌కు 6%-%7 డాలర్లు, 2026%-%27లో 6 డాలర్ల స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది.

## విస్తరణ దిశగా అల్ట్రావయొలెట్



బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ మోటర్‌సైకిల్స్ తయారీ సంస్థ అల్ట్రా వయొలెట్ తమ కొత్త యూవీ స్పేస్ స్టేషన్‌ను విజయవాడలో ప్రారంభించింది. ఇందులో ఎక్స్%-%47, ఎఫ్77 మాక్ 2, ఎఫ్77 సూపర్‌స్ట్రీట్ తదితర వాహనాలు అందుబాటులో ఉంటాయి. చూడటానికి స్టైలిష్ డిజైన్ కలిగిన అల్ట్రా వయొలెట్ ఎలక్ట్రిక్ బైకులు.. ఎందుకుని వేరియంట్‌ను బట్టి 2.8 సెకన్లలో గంటకు 60 కి.మీ. వేగాన్ని అందుకోగలవు. ఒక్కసారి చార్జి చేస్తే 323 కి.మీ. వరకు రేంజ్ ఉంటుంది. ఈ బైకులు ప్రస్తుతం దేశీయ విఫణిలో మాత్రమే కాకుండా.. గ్లోబల్ మార్కెట్లో కూడా అమ్మకానికి ఉన్నాయి. ఇవి అత్యుత్తమ పనితీరును అందించడం వల్ల ఎక్కువమంది.. ఈ బైకులను ఇష్టపడి కొనుగోలు చేస్తుంటారు.

## టఫే ఎలక్ట్రిక్ ట్రాక్టర్‌కు గుర్తింపు




జర్మనీలో నిర్వహించిన అగ్రిటెక్నికా 2025లో 'ట్రాక్టర్ ఆఫ్ ది ఇయర్' టాప్ 5 ఫైనలిస్టుల జాబితాలో తమ ఈవీ28 ఎలక్ట్రిక్ ట్రాక్టర్ చోటు దక్కించుకుందని టఫే ట్రాక్టర్స్ వెల్లడించింది. పర్యావరణహిత ట్రాక్టర్ల కేటగిరీలో ఈ గుర్తింపు దక్కించుకున్నట్లు వివరించింది. ఈ సందర్భంగా తమ కొత్త తరం ఎలక్ట్రిక్ హైబ్రిడ్ ట్రాక్టర్ ఈవీఎక్స్75 సహా మూడు ఉత్పత్తులను టఫే ప్రదర్శించింది. యూరోపియన్ రైతుల వైవిధ్యమైన అవసరాల కు ఇవి అనుగుణంగా ఉంటాయని సంస్థ వైస్ చైర్మన్ లక్ష్మీ వేణు తెలిపారు. వీటితో కేవలం ట్రాక్టర్ల తయారీ నుంచి అన్ని రకాల వ్యవసాయ సాధనాలునును అందించే సమగ్ర సంస్థగా ఎదిగినట్లవుతుందని వివరించారు. సబ్%-%100 హెచ్‌పీ సెగ్మెంట్‌లో అంతర్జాతీయంగా అగ్రగామిగా ఎదగాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నామని చైర్మన్ మల్లికా శ్రీనివాసన్ చెప్పారు. స్టార్టప్‌లతో కలిసి పనిచేస్తూ ప్రెసిషన్ అగ్‌టెక్, స్మార్ట్ ఫార్మింగ్, ఆటోమేషన్ మొదలైనవాటిపై గణనీయంగా ఇన్వెస్ట్ చేస్తున్నామని వివరించారు.

# 3 కంపెనీలు రెడీ




### సెబీ గ్రీన్ సిగ్నల్

న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ తాజాగా మూడు కంపెనీల దరఖాస్తులను ఆమోదించింది. ఈ జాబితాలో ఏస్‌వెక్టర్, సిల్వర్ కన్జ్యూమర్ ఎలక్ట్రికల్స్, స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ కంపెనీ చేరాయి. వీటిలో ఏస్‌వెక్టర్ 2025 జూలైలో గోప్యతా మార్గాన సెబీకి దరఖాస్తు చేసింది. సిల్వర్ కన్జ్యూమర్, స్టీల్ ఇన్‌ఫ్రా ఈ ఏడాది ఆగస్ట్‌లో ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. ప్రస్తుత క్యాలండర్ ఏడాది(2025)లో ప్రైమరీ మార్కెట్లు సరికొత్త రికార్డులవైపు పరుగు తీస్తున్నాయి. ఇప్పటికే ఈ ఏడాది 92 కంపెనీలు మెయిన్‌బోర్డులో ఐపీవోకు వచ్చాయి. ఈ బాటలో మరికొన్ని కంపెనీలు ఈ నెలలోనే స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు సిద్ధపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మరో 3 కంపెనీలకు సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం గమనార్హం! వివరాలు చూద్దాం..

**స్నాప్‌డీల్**

కునాల్ భల్, రోహిత్ బన్సల్ ఏర్పాటు చేసిన ఏస్‌వెక్టర్ రహస్య ఫైలింగ్ విధానంలో ఐపీవోకు అనుమతి పొందింది. ఇటీవల ఇదే మార్గంలో పలు దిగ్గజాలు పబ్లిక్ ఇష్యూ వచ్చిన సంగతి తెలిసిందే. కాగా.. ఈకామర్స్ సంస్థ స్నాప్‌డీల్ మాతృ సంస్థ అయిన ఏస్‌వెక్టర్.. సాస్ ప్లాట్‌ఫామ్ యూనికామర్స్‌సహా, కన్జ్యూమర్ బ్రాండ్ బిల్డింగ్ సంస్థ స్టెల్లారో బ్రాండ్స్‌ను నిర్వహిస్తోంది. వీటిలో యూనికామర్స్ 2024లోనే లిస్టయిన సంగతి తెలిసిందే.

**పంపులు, ఫ్యాన్లు**

పబ్లిక్ ఇష్యూ ద్వారా సిల్వర్ కన్జ్యూమర్ ఎలక్ట్రికల్స్ రూ. 1,400 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఇందుకు అనుగుణంగా రూ. 1,000 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను ప్రస్తుత వాటాదారులు ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 865 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మరో రూ. 35 కోట్లు అనుబంధ సంస్థ బీఏపీఎల్ రుణాల చెల్లింపులకు వినియోగించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది. కంపెనీ ప్రధానంగా పంపులు, మోటార్లు, ఫ్యాన్లు, లైటింగ్ తదితర కన్జ్యూమర్ ఎలక్ట్రికల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది.

**విస్తరణపై కన్ను**

స్టీల్ ఇన్‌ఫ్రా సొల్యూషన్స్ ఐపీవోలో భాగంగా రూ. 96 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా మరో 1.42 కోట్ల ఈక్విటీ షేర్లను ప్రస్తుత ఇన్వెస్టర్లు విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వడోదర, హైదరాబాద్, భిలాయ్‌లలోగల తయారీ ప్లాంట్ల విస్తరణతోపాటు.. వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

## ఐటీలో నియామకాలు బ్రేక్

### గత తొమ్మిది నెలల్లో భారీగా పడిపోయిన రిక్రూట్‌మెంట్లు

### ఏఐ, ఆటోమేషన్‌పై ఐటీ దిగ్గజాల దృష్టే కారణం..

న్యూఢిల్లీ: దేశీయ ఐటీ సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి ఆపసోపాలు పడుతున్నాయి. ఇప్పటికే నిర్వహణ ఖర్చులు తగ్గించుకోవడానికి పలు కీలక చర్యలు తీసుకుంటున్న సంస్థలు ..తాజా ఉద్యోగ నియామకాలకు బ్రేక్‌వేశాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం గడిచిన తొమ్మిది నెలల్లో దేశీయ ఐటీ దిగ్గజాలు నికరంగా 17 మందిని మాత్రమే రిక్రూట్ చేసుకున్నాయి. గతేడాది ఇదే సమయంలో ఐటీ సంస్థలు 17,764 మందిని నియమించుకున్నాయి. టెక్నాలజీ రంగం రూపాంతరం చెందుతున్నదని, ముఖ్యంగా కృత్రిమ మేధస్సు అనుసంధానం అధికం కావడం ఇందుకు కారణమని తెలిపింది.దీంతో టీసీఎస్ ఏకంగా 25 వేల మంది సిబ్బందిని తొలగించింది. సాంప్రదాయక వృద్ధికి దూరంగా అడుగులు వేస్తున్న ఐటీ సంస్థలౌఉత్పాదకతను పెంచుకోవడానికి పలు కఠిన చర్యలు తీసుకుంటున్నాయి. దీంట్లో భాగంగా ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు టాప్-5 సంస్థలు కేవలం 17 మందిని రిక్రూట్ చేసుకున్నాయి. భవిష్యత్తులో నియామకాలు ఉండకపోవచ్చని హెచ్చరించాయి కూడా. మరోవైపు, ఐటీ రంగంలో సంస్థలు విలీనాలు అధికంగా జరగడం కూడా నియమాకాలు తగ్గడానికి ప్రధాన కారణమని విశ్లేషించింది.ప్రధానంగా గణాంకాలు తాత్కాలిక మందగమనాన్ని కాకుండా నిర్మాణాత్మక మార్పును సూచిస్తున్నాయని అమెరికాకు చెందిన హెచ్‌ఎఫ్‌ఆర్ రిసెర్చ్ సీఈవో ఫిల్ ఫర్షేట్ తెలిపారు. ఐటీ సంస్థలు ఖర్చులను తగ్గించుకోవడానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నాయని, క్లయింట్లు కూడా తమ ప్రొడక్ట్‌ను పెంచుకోవడానికి చూస్తున్నాయన్నారు. మరోవైపు, ఏఐ, ఆటోమేషన్‌కు విస్తృతంగా డిమాండ్ నెలకొనడం కూడా రిక్రూట్‌మెంట్లను తగ్గించుకోవడానికి ప్రధాన కారణమన్నారు. ఒక్కో ఉద్యోగిపై లక్ష డాలర్ల కంటే అధికంగా వెచ్చిస్తున్న సంస్థ..దీంట్లో నాలుగో వంతు కూడా డిజిటల్ కోసం ఖర్చు కాకపోవడంతో సంస్థలు వీటి వైపు మొగ్గుచూపుతున్నాయన్నారు. ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం విప్రో..ఉద్యోగ నియామకాలను తగ్గించుకునేయోచనలో ఉన్నది.



# ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం

## ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్కులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది.మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.



## మత్తెక్కించేస్తున్న శాలిని పాండే

శాలిని పాండే తరవాత పెద్దగా సినిమాల్లో కనిపించలేదు. బాలీవుడ్‌లో మాత్రం అవకాశాలు దక్కించుకుంటోంది. ఈ మధ్య ఈ అమ్మడు తన ఎక్స్‌పోజింగ్‌తో కుర్రకారును మత్తెక్కిస్తోంది. తాజాగా శాలిని ఫోటోలు హాట్‌హాట్‌గా మారాయి.

# త్రీడీలో చూసి షాక్ అయ్యాను

“కార్తికేయ 2’ వంటి పాన్ ఇండియా విజయం తర్వాత అంతకంటే అద్భుతమైన ప్రాజెక్ట్‌తో రావాలని ఇన్ని రోజులు ఆగాను. అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ చేసిన సినిమా ‘స్వయంభు’. ఈ చిత్రం చూసిన తర్వాత నిఖిల్ మావాడు అని చెప్పడానికి మీరంతా చాలా సంతోషపడతారు” అని నిఖిల్ చె??పారు. నిఖిల్ హీరోగా, సంయుక్త, నభా నటేష్ హీరోయిన్లుగా నటించిన చిత్రం ‘స్వయంభు’. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, చైనీస్, స్పానిష్, అరబిక్ భాషల్లో త్వరలో రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్‌లో నిఖిల్ మాట్లాడుతూ-- “వెయ్యేళ్ల క్రితం రాయలసీమలోని చిత్తూరు ప్రాంతంలో కృష్ణ అనే యోధుడు ఉండేవారు. అల్లరిగా తిరిగే అండర్ డాగ్ రాజ్యాలను శాసించే స్థాయికి ఆయన ఎలా ఎదిగారు? అనేది మా సినిమాలో చూపించాం. ఈ మూవీని త్రీడీలో చూసినప్పుడు షాక్ అయ్యాను. ప్రేక్షకులు కూడా చాలా ఎంజాయ్ చేస్తారు” అని చె??పారు. భరత్ కృష్ణమాచారి మాట్లాడుతూ-- “ఈ సినిమా అందరికీ గొప్ప అనుభూతినిస్తుంది” అని పేర్కొన్నారు. “ఈ సినిమాలో భాగం కావడం చాలా గర్వంగా ఉంది” అన్నారు కెమెరామేన్ సెంథిల్ కుమార్.





# డబుల్ ధమాకా.. గతంలో బాలయ్య, నాని.. ఇప్పుడు శ్రీవిష్ణు

గతంలో ఒకసారి నందమూరి బాలకృష్ణ నటించిన నిప్పు రవ్వ , బంగారు బుల్లోడు చిత్రాలకు.. మరోసారి హీరో నాని నటించిన ఎవడే సుబ్రహ్మణ్యం, జండాపై కపిరాజు చిత్రాలకు ఇలాంటి సమస్యనే ఎదురైంది. తమ సినిమాల విడుదల విషయం తమ చేతిలో లేకపోవడం. ఒకేసారి రెండు సినిమాలు విడుదల చేయాల్సిన పరిస్థితి రావడం. ఇప్పుడు శ్రీవిష్ణుకి కూడా అదే పరిస్థితి ఎదురైంది. టాలీవుడ్ హీరో శ్రీవిష్ణు ఈ నెల చివర్లో ఓ ప్రత్యేక పరిస్థితిని ఎదుర్కోబోతున్నాడు. తను నటించిన రెండు సినిమాలు ఒకేసారి విడుదల కానున్నాయి. బాలయ్య రెండు చిత్రాలు ఒకేరోజు (1993 సెప్టెంబర్ 3) విడులైయ్యాయి. అలాగే నాని నటించిన రెండు చిత్రాలు 2015 మార్చి 21న విడుదలయ్యాయి. అయితే ఇప్పుడు అదే సీన్ రిపీట్ అయ్యే పరిస్థితి ఏర్పడింది. శ్రీవిష్ణు నటించిన మృత్యుంజయ్ చిత్రాన్ని నెట్‌ఫ్లిక్స్ తీసుకుంది. కానీ స్లాట్ ఈ నెలలోనే ఇచ్చింది. అయితే అదే శ్రీవిష్ణు నటించిన విష్ణు విన్యాసం సినిమాను మరో ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ తీసుకుంది. ఆ సంస్థ కూడా ఇదే నెలకు డేట్ ఇచ్చింది. ఈ విషయంపై చర్చలు జరిగాయి కానీ నో యూజ్. ఇద్దరూ ఒకే తేదీపై పట్టుబడటంతో నిర్మాతలు, హీరో శ్రీవిష్ణు కూడా ఏం చేయలేని పరిస్థితి. రెండు సినిమాలు తనవే కావడంతో, రెండింటినీ సమానంగా ప్రమోట్ చేయాల్సిన బాధ్యత శ్రీవిష్ణుపై పడింది. ఇప్పటికే మృత్యుంజయ్ టీజర్ విడుదలైంది. మరో రెండు రోజుల్లో విష్ణు విన్యాసం టీజర్ కూడా రానుంది. ఆ వారం ఈ రెండు సినిమాలు తప్ప మరే పెద్ద రిలీజ్ లేకపోవడం శ్రీవిష్ణు అదృష్టమే. రెండు సినిమాలు ఒకేసారి రావడం వల్ల ప్రేక్షకులకు డబుల్ ఎంటర్టైన్‌మెంట్ లభించనుంది. అయితే ఏదో ఒకటి ఎడ్జ్ తీసుకునే అవకాశం ఉంది. కానీ కంటెంట్ బలంగా ఉంటే మాత్రం రెండూ హిట్ అయ్యే అవకాశం ఉంది. ఈ పరిస్థితి శ్రీవిష్ణుకు ఒకవైపు ఎంబ్రాసింగ్, మరోవైపు ఎక్సైటింగ్ కూడా. ఎందుకంటే ఒకేసారి రెండు సినిమాలు తనవే అని చెప్పుకోవడం అరుదైన విషయం. చూడాలి మరి చివరికి ఏమౌతుందో. విష్ణు విన్యాసం టీజర్ రిలీజైతే ఈ విషయంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

